దివ్యాంగులకు 'స్వయం ఉపాధి'

- రుణాల కోసం ఈనెల 12 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- జిల్లాకు 17 యూనిట్లు మంజూరు



స్వయం ఉపాధి ద్వారా కిరాణం కొట్టు పెట్టుకున్న పెద్దపల్లి మండలం గుర్రాంపల్లికి చెందిన శంకరయ్య

సుల్తానాబాద్: రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి రాగానే దివ్యాంగులకు జీవనోపాధి కల్పించాలన్న సంకల్పంతో స్వయం ఉపాధి పథకాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. కుటుంబంలో మరొకరికి భారంగా ఉండకుండా ఉండేందుకు స్వయం ఉపాధితో కుటుంబాన్ని పోషించాలనే సంకల్పంతో స్వయం ఉపాధి పథకాలు దరఖాస్తు చేసుకోవాలని ముందుకు వచ్చింది. ఇటీవల దివ్యాంగుల కోసం ట్రై సైకిళ్లను పంపిణీ చేశారు. జీవనోపాధి కోసం కిరాణం, జనరల్ స్టోర్‌తో పాటు పలు రకాల దుకాణాలు 80శాతం సబ్సిడీ ద్వారా రుణాలు అందించనున్నారు. జిల్లావ్యాప్తంగా ఉన్న దివ్యాంగులు ఈనెల 12లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని అధికారులు సూచించారు. జిల్లావ్యాప్తంగా 21,484మంది దివ్యాంగులు ఉన్నారు.

కమిటీ కన్వీనర్‌గా సీడీపీవో..

జిల్లాలోని దివ్యాంగుల సౌకర్యార్థం నియమ, నిబంధనల మేరకు పరిశీలించి అర్హత గల దివ్యాంగులను ఎంపిక చేస్తారు. సదరు జాబితాను రాష్ట్ర దివ్యాంగుల స్వయం ఉపాధి పథకాల కోసం దరఖాస్తు చేసుకున్న దరఖాస్తులను స్క్రీనింగ్ చేస్తారు. దీంతో పాటు ఎంపిక కోసం సీడీపీవో కన్వీనర్‌గా, సభ్యులుగా ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్, బ్యాంకు మేనేజర్ ఏపీఎంలు వ్యవహరించనున్నారని కలెక్టర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు

జిల్లాకు 17 యూనిట్లు..

మున్సిపల్‌తోపాటు గ్రామాలకు 17 యూనిట్లు మంజూరు చేసింది. రూ.50,000 మొదలుకొని రూ.20 లక్షల వరకు యూనిట్లకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. రూ.50వేలకు వందశాతం సబ్సిడీ కాగా, రూ.లక్షకు 80శాతం సబ్సిడీ, రూ.2లక్షలకు 70శాతం సబ్సిడీ, రూ.2లక్షల నుంచి రూ.20 లక్షల వరకు 60శాతం సబ్సిడీతో యూనిట్లు అందించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

ఐదేళ్లలో దివ్యాంగులు స్వయం ఉపాధి పథకం పొంది ఉండరాదు. అలా పొంది ఉంటే అనర్హులుగా గుర్తిస్తారు. దరఖాస్తు చేసుకునే వారి ఆదాయ పరిమితి గ్రామీణ ప్రాంతాల్లో ఏడాదికి రూ.1.50లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2లక్షల లోపు ఆదాయం ఉండాలి. తహసీల్దార్‌తో ధృవీకరించిన ఆదాయ సర్టిఫికెట్ జతచేయాలి. ఏప్రిల్ 12లోగా దరఖాస్తులు సంబంధిత ధృవపత్రాలతో దరఖాస్తులను జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలో సమర్పించాలి. ఇతర వివరాలకు జిల్లా సంక్షేమాధికారి కార్యాలయంలో పనివేళలో నేరుగా సంప్రదించాలి.

అర్హతలు

- 40శాతం దివ్యాంగుల సర్టిఫికెట్ మెడికల్ బోర్డు ఇవ్వాల్సి ఉంటుంది.
- 21 ఏళ్ల నుంచి 55 ఏళ్ల లోపు ఉన్న వారు అర్హులు.
- తహసీల్దార్ ధ్రువీకరణ తప్పనిసరి.

కలెక్టర్ ఆధ్వర్యంలో ఎంపిక



ప్రభుత్వాల నుంచి దివ్యాంగుల కోటలో స్వయం ఉపాధి పథకాల ద్వారా లబ్ధి పొందిన వారు దరఖాస్తు చేసుకునేందుకు అనర్హులు. ఐదేళ్లలోపు రుణాలు తీసుకున్న వారికి ప్రభుత్వం నుంచి ఎలాంటి రుణాలు తీసుకోవడానికి అనుమతి లేదు. ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకున్న తర్వాత జిరాక్స్ కాపీలను కార్యాలయంలో అందజేయాలి. పైరవీలకు తావు లేకుండా కలెక్టర్ ఆధ్వర్యంలో ఎంపిక జరుగుతుంది.

– వేణుగోపాల్‌రావు, డీడబ్ల్యూవో, పెద్దపల్లి

ఘనంగా ఎంపీ జన్మదిన వేడుకలు





గోదావరిఖని: కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ ధర్మారం: కేక్ కట్ చేస్తున్న విప్ లక్ష్మణ్‌కుమార్

గోదావరిఖని/ధర్మారం: పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ జన్మదిన వేడుకలను సోమవారం రామగుండం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, ధర్మారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ధర్మారంలో విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, రామగుండంలో ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. నాయకులు పి.మల్లికార్జున్, దీటి బాలరాజు, రాచకొండ కోటేశ్వర్లు, గోవర్దన్‌రెడ్డి, మధు, ధర్మారంలో మండల అధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతిరెడ్డి, చింతల ప్రదీప్‌రెడ్డి, దేవి జనార్దన్, ఓరం చిరంజీవి, ఎదుల్ల అంజయ్య, చుక్కా నాయక్, పొనవేని స్వామి పాల్గొన్నారు.

మేళా సద్వినియోగం చేసుకోవాలి

పెద్దపల్లిరూరల్: మున్సిపల్ ఆఫీసు ఆవరణలో నిర్వహిస్తున్న మేళాలను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్ అన్నారు. ట్రేడ్, ఎల్ఆర్ఎస్ మేళా సోమవారం నిర్వహించారు. సోమవారం నుంచి ఈనెల 25 వరకు నిర్వహించే మేళాలను వినియోగించుకోవాలన్నారు. పెద్దపల్లికి చెందిన సయ్యద్‌మీర్ ఎల్ఆర్ఎస్ మేళాలో అనధికార ప్లాటును ఎల్ఆర్ఎస్ రుసుం రూ.24,419 చెల్లించి క్రమబద్ధీకరించారు. అవసరమున్న వారంతా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. టీపీవో వినయ్, సిబ్బంది శ్రీకర్, సంధ్య ఉన్నారు.

జాతీయ సమైక్యత శిబిరానికి విద్యార్థి ఎంపిక

గోదావరిఖనిటౌన్: కర్ణాటక బెంగళూరులోని శేషాద్రిపురం కళాశాలలో ఈ నెల 11 నుంచి 17వ తేదీ వరకు జరిగే జాతీయ సమైక్యత శిబిరానికి గోదావరిఖని యూనివర్సిటీ పీజీ కళాశాలకు చెందిన ఎంబీఏ ద్వితీయ సంవత్సరం జాతీయ సేవా పథకం వలంటీర్ దినేశ్ ఎంపికై నట్లు కళాశాల ప్రిన్సిపల్ ఎస్.రమాకాంత్ తెలిపారు. శిబిరంలో శాతవాహన యూనివర్సిటీకి చెందిన వలంటీర్లు తెలంగాణ సాంస్కృతిక కళారూపాలు ప్రదర్శించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రవికుమార్, జాతీయ సేవా పథకం సమన్వయకర్త మనోహర్, అధ్యాపకులు దినేశ్‌ను అభినందించారు.

సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న అధికారులు

పెద్దపల్లిరూరల్: ఆన్‌లైన్ మోసాలు, సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన కలిగి ఉండాలని షీటీం సభ్యురాలు స్నేహలత అన్నారు. పట్టణంలోని చింతలవాడలోని పాఠశాల విద్యార్థులకు సోమవారం అవగాహన కల్పించారు. మహిళల భద్రత, యాంటీడ్రగ్స్‌పై వివరించారు. రద్దీగా ఉండే ప్రాంతాల్లో మహిళల రక్షణ కోసం బస్టాండ్, ప్రధాన చౌరస్తాలో నిరంతర నిఘా ఉంచుతున్నట్లు పేర్కొన్నారు. వేధింపులకు గురిచేసే పోకిరీల సమాచారాన్ని 63039 23700 నంబర్‌కు అందించాలన్నారు. అవసరమైతే టోల్ ఫ్రీ నంబర్ డయల్ 100కు చేయాలన్నారు. సైబర్ నేరాల నియంత్రణకు 1930కి సమాచారం ఇవ్వాలని సూచించారు. సభ్యులు సురేశ్, మౌనిక, అహ్మద్, హకీంఖాన్ ఉన్నారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



చండీహోమం నిర్వహిస్తున్న రుత్వికులు

కాల్వశ్రీరాంపూర్: కాల్వశ్రీరాంపూర్ హరిహర క్షేత్రంలో సోమవారం బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఉదయం ప్రాతఃకాల పూజ, నిత్య పూజలు, దీపారాధన, మంగళహారతులు, తీర్థప్రసాద వితరణ చేశారు. రుత్వికులు మల్లవజ్జల ప్రవీణ్ శర్మ చండిహోమ క్రతువు జరిపించారు. హైకోర్టు న్యాయవాది ఎరబాటి సునీత అశోక్‌రావు, పెద్దపల్లి పట్టణానికి చెందిన వాణిజ్య వ్యాపారవేత్త జానకీరామ్ భవానీ భాస్కర్‌రావు దంపతులు హోమంలో పాల్గొన్నారు. వేదపండితులు రఘురామ్, అర్చక పురోహితులు దత్తాత్రేయ శర్మ, సాయికృష్ణ శర్మ, వల్లూరి సతీశ్‌శర్మ, ఏఎంసీ మాజీ చైర్మన్ జిన్న రాంచంద్రారెడ్డి, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పులి కిషన్‌రెడ్డి, నాయకులు బూర్ల రవి, నార్ల రాజన్న, భూషణవేని శ్రీశైలం గౌడ్, భక్తులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

• గుండెపోటుతో బీఆర్ఎస్ నాయకుడు మృతి

ఎలిగేడు: మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ యువ నాయకుడు కవ్వంపల్లి అనిల్ ఆదివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి సోమవారం అనిల్ మృతదేహానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. బీఆర్ఎస్ నాయకులు తానిపర్తి మోహన్‌రావు, నాయకులు బాసంపల్లి వినోద్, బాపయ్య, న్యాతరి పోచయ్య ఉన్నారు.

• చికిత్స పొందుతూ వృద్ధుడు..

ఓదెల: పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓదెల గ్రామానికి చెందిన పేరం రామయ్య(62)అనే వృద్ధుడు ఎంజీఎం హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. పొత్కపల్లి పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. రాములు 20ఏళ్ల క్రితం ఊపిరితిత్తుల ఆపరేషన్ చేయించుకున్నాడు. దీంతో అప్పుడప్పుడు ఛాతిలో నొప్పి రావడంతో జీవితంపై విరక్తిచెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆదివారం పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు వరంగల్ ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. మృతుడి భార్య కొమురక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

• ఎంపీటీసీ ఎన్నికల ఓటరు జాబితా విడుదల

కాల్వశ్రీరాంపూర్: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీటీసీ ఎన్నికల జాబితాను ఎంపీడీవో రామ్మోహనా చారి విడుదల చేశారు. మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో 34,738 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 17,189 మంది పురుషులు, 17,548 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. మండలంలో 65 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ఓటరు జాబితా ఏర్పాటు చేశామని ఎంపీడీవో పేర్కొన్నారు. ఓటరు జాబితాలో తప్పులు, సవరణలు ఉంటే సరిచేసుకోవాలని సూచించారు. ఎంపీవో కిరణ్, సూపరింటెండెంట్ శ్రీధర్, కార్యదర్శులు ఉన్నారు.

• ఇష్టానుసారంగా మాట్లాడితే ఊరుకోం

గోదావరిఖని: కాంగ్రెస్ నాయకులు ఇష్టానురంగా మాట్లాడితే ఊరుకోమని బీఆర్ఎస్ నాయకులు నీరటి శ్రీనివాస్ అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ కార్పొరేటర్ కుమ్మరి శ్రీనివాస్‌తో కలిసి ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు మాజీ ఎమ్మెల్యే అనే గౌరవం లేకుండా మట్లాడటం సరికాదన్నారు. రూ.30కోట్ల పనులు నెలరోజుల్లో ఎలా పూర్తవుతాయని ప్రశ్నించారు. సమావేశంలో నాయకులు అచ్చె వేణు, మెతుకు దేవరాజ్, జక్కుల తిరుపతి, బొడ్డుపల్లి శ్రీనివాస్, కల్వచర్ల కృష్ణవేణి, యాసర్ల తిమోతి, తోకల రమేశ్, సట్టు శ్రీనివాస్, బుర్ర వెంకటేశ్, ఇరుగురాళ్ల శ్రావణ్, రాజు, అవునూరి వెంకటేశ్, ఎడెల్లి శ్యాం, స్వప్న పాల్గొన్నారు.

ఓవర్‌లోడ్ వాహనాలతో రోడ్లు ధ్వంసం



సుల్తానాబాద్: పలు ప్రాంతాల నుంచి ఓవర్ లోడ్‌తో వచ్చే వాహనాలతో సుల్తానాబాద్ రోడ్లు ధ్వంసం అవుతున్నాయని, గ్రానైట్ లారీ, ధాన్యం లారీలు, ఎన్టీపీసీ నుంచి వెళ్లే బూడిద లారీలు, పలు రకాల సామగ్రి తీసుకొని వెళ్లే వాహనాలు ఓవర్ లోడ్‌తో వెళ్లడంతో రోడ్లు ధ్వంసం అవుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. పోలీసులు, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు తనిఖీలు చేస్తే ఇలాంటివి జరగవని అంటున్నారు.

వినియోగంలోకి మరుగుదొడ్లు

సాక్షి ఎఫెక్ట్..



శుభ్రం చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

సుల్తానాబాద్: పట్టణంలోని కాల్వశ్రీరాంపూర్ చౌరస్తా, మినీ కలెక్టరేట్ ఎదుట ఉన్న మరుగుదొడ్లు వినియోగంలో లేకపోవడంతో కార్యాలయాలకు వచ్చే వారు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై ఇటీవల 'సాక్షి'లో కథనం ప్రచురించింది. ఇటీవల మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన మహమ్మద్ నియాజ్ స్పందించి మరుగుదొడ్లు శుభ్రం చేయించి, ఓపెన్ చేయించారు. పలువురు 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.

క్లుప్తంగా

ఆత్మ రక్షణకు కరాటే నేర్చుకోవాలి



సర్టిఫికెట్లు అందజేస్తున్న ఏసీపీ రమేశ్

జ్యోతినగర్: ఆత్మ రక్షణకు కరాటే నేర్చుకోవాలని గోదావరిఖని ఏసీపీ మడత రమేశ్ అన్నారు. రామగుండం నాలుగో డివిజన్ కృష్ణానగర్‌లోని ఓ ఫంక్షన్ హాల్లో విక్టరీ షోటోఖాన్ కరాటే అసోసియేషన్ దూ ఇండియా సురేశ్ మాస్టర్ ఆధ్వర్యంలో సోమవారం బెల్ట్ అవార్డింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ఇటీవలి కాలంలో బాలికలు, మహిళలపై జరుగుతున్న దాడుల గురించి తెలిపారు. చిన్నప్పటి నుంచే బాలికలకు కరాటే లాంటి మార్షల్ ఆర్ట్స్ నేర్పించాలన్నారు. తల్లిదండ్రులు విద్యార్థులను చదువే కాకుండా క్రీడల వైపు ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ రాజేశ్వరరావు, గ్రాండ్‌మాస్టర్ మల్లికార్జున్‌గౌడ్, వీఎస్‌కేఏ చైర్మన్ సదాశివుడు, ఎస్‌బీ ఎస్సై రామకృష్ణ, కాంగ్రెస్ ఎన్టీపీసీ పట్టణ కమిటీ అధ్యక్షుడు ఆసిఫ్‌పాషా, బచ్‌పన్ స్కూల్ శ్రీధర్ పాల్గొన్నారు.

శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో రుద్రాభిషేకం



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు

జూలపల్లి: మండల కేంద్రంలోని శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో సోమవారం రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి ఉద్దండ నవీన్ భక్తులకు స్వామివారి ఆశీస్సులు అందజేసి తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు. అనంతరం ఆలయంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్‌సింగ్ ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు గంట రాములుయాదవ్, పీఏసీఎస్ చైర్మన్ కొంజెర్ల వెంకటయ్య, వేణుగోపాలరావు, లోక రవీందర్‌రెడ్డి, పొట్టాల మల్లేశం, మల్లేశంయాదవ్, తిరుపతియాదవ్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్ర బంద్ విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న నాయకులు

గోదావరిఖని: రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న వర్గీకరణ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ 14న రాష్ట్ర బంద్‌కు పిలుపునిస్తున్నామని మాల మహానాడు ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు పసుల రామ్మూర్తి, రాష్ట్ర అధ్యక్షుడు జూపాక సుధీర్ తెలిపారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరు సమావేశంలో వారు మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆగమేఘాల మీద వర్గీకరణ నిర్ణయం తీసుకొని అటు మాలలు సంతోషంగా లేకుండా, ఇటు మాదిగలు సంతోషంగా లేకుండా చేశారని ఆరోపించారు. రాజకీయ పార్టీలు దళితులను, బీసీలను రాజ్యాధికారం దిశగా ఎదగకుండా కుట్రలు చేస్తున్నాయని వాటి మాయలో మనం పడొద్దన్నారు. సమావేశంలో మాల మహానాడు ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షుడు దేవి లక్ష్మీనర్సయ్య, దేవరపల్లి మధుబాబు, రాజకిశోర్, కారంగుల శ్రీశైలం, రమణ, రాములు, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ భవనం కోసం నిధులు మంజూరు చేయండి



వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మంథని: మంథని మున్సిపాలిటీలో బీసీ కమ్యూనిటీ హాల్ కోసం నిధులు మంజూరు చేయాలని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు సోమవారం కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొటికారి కిషన్‌జీ వినతిపత్రం అందజేశారు. బీసీ కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం మున్సిపాలిటీ పరిధిలో 5గుంటల స్థలం ఇచ్చేందుకు పాలకవర్గం తీర్మానం చేశారని వినతిపత్రంలో పేర్కొన్నారు. మండల అధ్యక్షుడు ప్రసాద్, నాయకులు వెంకన్న ఉన్నారు.

దుకాణాలు స్వల్పంగా దగ్ధం

గోదావరిఖనిటౌన్: స్థానిక ప్రధాన చౌరస్తాలోని మున్సిపల్ కాంప్లెక్స్ ఎదుట గల చిరు వ్యాపారుల దుకాణాలు పవర్ చార్జీ బ్యాటరీ షార్ట్ సర్క్యూట్‌తో సోమవారం ఉదయం 6.30గంటలకు సామాను దగ్ధమైంది. సుమారు రూ.15వేల ఆస్తి నష్టం జరిగినట్టు స్టేషన్ ఆఫీసర్ పి.లక్ష్మీనారాయణ తెలిపారు.



ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ గౌతమినగర్ ప్రధాన రహదారిపై కొన్ని రోజులుగా రామగుండం నగరపాలక సంస్థ పరిధిలోని పలు డివిజన్ల నుంచి సేకరించిన చెత్తను ఆర్ఎఫ్‌సీఎల్ ప్రధాన రహదారి పక్కన డంప్ చేస్తున్నారు. దీంతో కాలనీవాసులు దుర్వాసనతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కార్పొరేషన్ అధికారులు స్పందించి రోడ్డుపై చెత్తను డంపు చేయకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

చలో హైదరాబాద్ కార్యక్రమానికి తరలిరావాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

గోదావరిఖని: అన్ని కార్మిక సంఘాలతో కలిసి చలో సింగరేణి భవన్‌కు కార్యాచరణ సిద్ధం చేసినట్లు మారుపేర్ల బాధితుల సంఘం నాయకులు తెలిపారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మారుపేర్ల, విజిలెన్స్ పెండింగ్ కేసులు పరిష్కరించాలని గోలేటి నుంచి కొత్తగూడెం హెడ్ ఆఫీస్ వరకు తాము చేపట్టిన పోరుయాత్ర విజయవంతం కావడంతో తొందర్లోనే కార్మిక సంఘాలతో కలిసి చలో హైదరాబాద్ సింగరేణి భవన్ కార్యక్రమం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. సింగరేణి మారుపేర్ల విజిలెన్స్ పెండింగ్ కేసుల పరిష్కారం కోసం ఇబ్బంది పడుతున్న యాజమాన్యం పట్టించుకోవడం లేదన్నారు. తమ పోరుయాత్రకు 11 కోల్ బెల్ట్ ఏరియా జీఎంలను కలిసి వినతిపత్రాలు అందజేశామన్నారు. చలో హైదరాబాద్ కార్యక్రమానికి అన్ని కార్మిక సంఘాలు తరలిరావాలని కోరారు. సింగరేణి మారుపేర్ల విజిలెన్స్ పెండింగ్ కేసుల భాధితులు డిపెండెంట్లు లక్క శ్రావణ్, తిరుమల శ్రీనివాస్, ఓంప్రకాశ్, ఈర్ల సతీశ్, హరీశ్, వెంకటేశ్, ప్రదీప్‌వర్మ, సునీల్‌రెడ్డి, రాజు, సందీప్, వెంకటేశ్ పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులకు ఉపాధి కల్పించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

రామగిరి: ఆర్జీ–3 పరిధి ఓసీపీ–2లోని కాంట్రాక్టు కార్మికులకు ఉపాధి కల్పించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల వెంకన్న డిమాండ్ చేశారు. ఓసీపీ–2 ప్రాజెక్టు అధికారి సీ.హెచ్.వెంకటరమణకు సోమవారం కాంట్రాక్టు కార్మికులతో కలిసి వినతిపత్రం అందజేశారు. పెనాల్టీ మూలంగా కాంట్రాక్టర్స్ టెండర్ వేయలేదని, మ్యాన్ పవర్ టెండర్ అయిపోవడంతో కాంట్రాక్టు కార్మికులు ఉపాధి లేక ఉంటున్నారని తెలిపారు. మాస్టర్ బేస్‌లో టెండర్ తీసుకుని కార్మికులకు ఉపాధి కల్పించాలని కోరారు. పీవో స్పందించి కాంట్రాక్టు కార్మికులకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారని వెంకన్న తెలిపారు. గని మేనేజర్ రామరావు, వెల్ఫేర్ ఆఫీసర్ మురళి, కార్మికులు ఓదెలు, సంపత్ పాల్గొన్నారు.

అన్ని ప్రాంతాల్లో సీసీ కెమెరాలు



మాట్లాడుతున్న సీఐ ప్రవీణ్‌కుమార్

ధర్మారం: వ్యాపారుల సంఘటిత సహకారంతో మండల కేంద్రంలోని అన్ని ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని పెద్దపల్లి సీఐ ప్రవీణ్‌కుమార్ అన్నారు.ధర్మారం పోలీస్‌స్టేషన్‌లో సోమవారం వ్యాపార, వాణిజ్య, కుల సంఘాల నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి సీఐ ప్రవీణ్‌కుమార్ హాజరై మాట్లాడుతూ పట్టణంలో దొంగతనాలను అరికట్టేందుకు సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు వచ్చిన వ్యాపార వర్గాలను ఆయన అభినందించారు. నిందితులను పట్టుకునేందుకు సీసీ కెమెరాలు ఎంతో దోహదపడుతాయన్నారు. శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకుని ప్రతీ గల్లీలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్న స్థానిక ఎస్సై లక్ష్మణ్, కానిస్టేబుల్ రజనీకాంత్‌ను ఆయన అభినందించారు. వారంలోగా 50సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని ఆయన పేర్కొన్నారు. ప్రతీగ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు ఆయా గ్రామాల ప్రజలు ముందుకు రావాలని ఆయన కోరారు. ఎస్సై శీలం లక్ష్మణ్, వ్యాపార, వాణిజ్య సంస్థల ప్రతినిధులతో పాటు కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రోడ్డుపక్కనే చెత్తకుప్పలు



రోడ్డుపై పేరుకుపోయిన చెత్త

జ్యోతినగర్: నగర సుందరీకరణకు కృషి చేస్తామంటున్న పాలకులకు, అధికారులకు రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్తకుప్పలు కనిపించడం లేదా అని స్థానిక ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఎన్టీపీసీ రామగుండం సింధూర కళాశాల రోడ్డులో మున్సిపల్ సిబ్బంది రోడ్డును ఊడ్చి కుప్పలు చేసినప్పటికీ వాటిని తొలగించే వారు లేకపోవడంతో రోజుల తరబడి కుప్పలు కుప్పలుగా పేరుకుపోతున్నాయి. సంబంధిత విభాగం వారు స్పందించి చెత్త తొలగింపు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఉపాధి కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ

జూలపల్లి: వేసవిలో ఎండ తీవ్రత దృష్ట్యా ఉపాధిహామీలో పనిచేసే ఎఫ్ఏలకు, కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను సోమవారం మండల వైద్యాధికారి సంపత్‌రెడ్డి పంపిణీ చేశారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఏపీవో సదానందం, వైద్యసిబ్బంది ఉన్నారు.

బీసీ సంఘం మండల అధ్యక్షుడిగా రవి

పెద్దపల్లిరూరల్: రాష్ట్ర బీసీ సంఘం మండల అధ్యక్షుడిగా కలవేన రవిని నియమిస్తూ బీసీ సంఘం జిల్లా అధ్యక్షులు నల్లవెల్లి శంకర్ సోమవారం ఉత్తర్వులు విడుదల చేశారు. బీసీ సంఘం బలోపేతానికి సహకారం అందిస్తున్న మండలంలోని పెద్దబొంకూర్‌కు చెందిన రవిని మండల అధ్యక్షుడిగా నియమిస్తూ నియామక పత్రం అందజేశారు.